సాక్షి చిత్తూరు

శుక్రవారం । 10 । జనవరి । 2025

I

స్విమ్స్‌లో బాధిత భక్తులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



న్యూస్‌రీల్

17న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 17వ తేదీన సంకట హర గణపతి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు విరివిగా పాల్గొన్నాలని ఆయన కోరారు.

ప్రపంచకప్ టెక్నికల్ అఫిషియల్‌గా పీఈటీ సురేష్



పీఈటీ సురేష్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రపంచకప్ ఖోఖో పోటీలకు టెక్నికల్ అఫిషియల్‌గా ప్రభుత్వ పాఠశాల పీఈటీ సురేష్ ఎంపికై నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని యాదమరి మండలం కొటాలం జెడ్పీ హైస్కూల్‌లో పీటీగా విధులు నిర్వహిస్తున్న సురేష్ ప్రపంచకప్ ఖోఖో పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ నెల 13 నుంచి 19 వ తేదీ వరకు న్యూఢిల్లీలో మొట్టమొదటి ప్రపంచ కప్ ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 24 దేశాలకు చెందిన మహిళలు, పురుషులు పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు జిల్లా నుంచి టెక్నికల్ అఫిషియల్‌గా సురేష్ ఎంపిక కావడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం ఆయన్ని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, శరత్‌బాబు అభినందించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు



డీఈఓ వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : సంక్రాంతి సెలవుల్లో ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని డీఈఓ వరలక్ష్మి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులుంటాయన్నారు. ఈ సెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించకూడదని తెలిపారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు పాఠశాలలకు సెలవులు ఇచ్చారన్నారు. ఆ సెలవుల్లో ఫిబ్రవరి నెలలో సర్దుబాటు చేస్తామన్నారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీవైఈఓ, ఎంఈఓ, సీఆర్పీలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. టీచర్లు త్వరితగతిన టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టిస్)లో వివరాలు నమోదు చేయాలన్నారు. టిస్ నమోదులో చిత్తూరు జిల్లా వైఎస్సార్ కడప జోన్‌లో మొదటి స్థానంలో ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న 1,142 మంది వెంటనే వివరాలు నమోదు చేయాలని డీఈఓ ఆదేశించారు.

అడ్డంకులను ఛేదిస్తూ.. ఆత్మీయత కురిపిస్తూ..

- వైఎస్ జగన్ వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డంకులు
- వైకుంఠ ద్వార దర్శన బాధితులను పరామర్శించకుండా కూటమి నేతల ఎత్తుగడలు
- కుటిల రాజకీయాలకు తలొగ్గిన పోలీసులు
- అన్నింటినీ దాటుకుని గాయపడ్డ భక్తులను పరామర్శించిన మాజీ సీఎం
- ఆత్మీయతను పంచుతూ.. అండగా నిలుస్తామని భరోసా
- నేను ఉన్నానని.. ఆదుకుంటానని హామీ

ఆంక్షల కంచెను ఛేదించారు. కూటమి కుట్రలను భగ్నం చేశారు. పోలీసుల ఎత్తుగడలను చీల్చుకుంటూ శ్రీపద్మావతి మెడికల్ కళాశాలకు చేరుకున్నారు. బుధవారం రాత్రి వైకుంఠద్వార దర్శన టికెట్ల తోపులాటలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని గురువారం మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. ముందుగా ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన తిరుపతి బయల్దేరారు. తిరుచానూరు వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డంకులు సృష్టించారు. కూటమి నేతల ఒత్తిడి మేరకు సుమారు అర్ధగంట తర్వాత వెళ్లాలని సూచించారు. వారి కుటిల బుద్ధిని గ్రహించిన జననేత కాలినడకన బయల్దేరారు. కొంతదూరం వెళ్లాక పార్టీ కార్యకర్త కారులో శ్రీపద్మావతి మెడికల్ కళాశాలకు చేరుకున్నారు. గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను ఆప్యాయంగా పలకరించారు. చేతులు పట్టుకుని ఆత్మీయతను కురిపించారు. గాయాలను చూసి చలించిపోయారు. అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. తొక్కిసలాట ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యుల కన్నీళ్లు తుడిచి ఓదార్చారు. నేనున్నానంటూ భరోసానిచ్చారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరామర్శలో మాజీ ముఖ్యమంత్రి వెంట మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి



పరామర్శిస్తున్న వైఎస్.జగన్, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు



వైద్యసేవలపై ఆరా తీస్తున్న వైఎస్ జగన్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



క్షతగాత్రురాలిని ఆప్యాయంగా ఓదార్చుతూ..



వైద్యులతో మాట్లాడుతున్న మాజీ సీఎం



క్షతగాత్రురాలి పరిస్థితిని వివరిస్తున్న ఎంపీ



వైఎస్.జగన్‌కు శ్రేణుల అభివాదం

తలోమాట

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తొక్కిసలాట ఘటనపై సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తలోమాట మాట్లాడారు. వేర్వేరు అధికారులను టార్గెట్ చేసి మాట్లాడారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని సీఎం చంద్రబాబు నోరెత్తి మాట్లాడలేదు. డెప్యూటీ సీఎం మాత్రం టీటీడీ చైర్మన్, ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి తప్పుందని తేల్చిచెప్పారు. వారి మధ్య సమన్వయ లోపం వల్లే తొక్కిసలాట జరిగిందని స్పష్టం చేశారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, జేఈఓ గౌతమి, సీఎస్ఓ శ్రీధర్, గోశాల డైరెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అదే విధంగా తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తొక్కిసలాట జరిగింది. ఆ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు మూడు నెలలుగా సీఐ లేరు. సీఐగా పనిచేస్తున్న మహేశ్వర్‌రెడ్డిని గతంలో బదిలీ చేశారు. అప్పటి నుంచి సీఐని నియమించలేదు. వెస్ట్ సీఐకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా తిరుపతిలోని కొందరు డీఎస్పీలు, సీఐలు చేసిన తప్పిదమే ఘోరమైన ఘటనకు కారణంగా పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న విషయాన్ని ఆ డీఎస్పీలు, సీఐలు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లలేదని తెలిసింది. ముఖ్యంగా నిఘా వర్గాలైన ఇంటిలిజన్స్, విజిలెన్స్, ఎస్పీ రద్దీని ఎందుకు అంచనా వేయలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి షో

- పరామర్శల పేరుతో ఫొటోలకు ఫోజులిచ్చిన సీఎం, డెప్యూటీ సీఎం
- తూతూమంత్రంగా బాధితుల పరామర్శ



అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

తిరుపతి అర్బన్/తిరుపతి గాంధీరోడ్డు : భక్తులకు భద్రత కల్పించడంలో విఫలమైన కూటమి ముఖ్యనేతలు సీఎం చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పరామర్శల పేరుతో షో చేసి వెళ్లడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా .. ఆరుగురు భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాక అధికారులపై చిందులేయడమేంటని మండిపడుతున్నారు. గురువారం తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాలను వారు పరిశీలించారు. భక్తుల తోపులాటకు గురైన ఘటనా స్థలాలను పరిశీలిస్తున్న సందర్భంగా వారు ప్రవర్తించిన తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. కేవలం టీవీలు, పత్రికల్లో ఫొటోలకు ఫోజులిచ్చేందుకు మాత్రమే వారు ప్రాధాన్యత ఇచ్చారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను కూడా తూతూమంత్రంగా పరామర్శించారని మండిపడుతున్నారు. మృతుల కుటుంబాలకు మేమున్నామని భరోసా నివ్వాల్సిన నేతలు కేవలం కంటితుడుపుగా కన్నీళ్లు తుడిచి వెళ్లారని పేర్కొంటున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వారు చనిపోవడం.. వారికి మొక్కుబడిగా ప్రభుత్వం తరపున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంపై మండిపడుతున్నారు. ప్రభుత్వ తప్పిదం వల్లే వారి ప్రాణాలు పోయాయని, ఒక్కో కుటుంబానికి కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మృతుల కుటుంబ సభ్యులకు టీటీడీలోనే ఉద్యోగాలు కల్పించాలని సూచిస్తున్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా టీటీడీలో రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తుతూ సాధారణ భక్తులను గాలికొదిలేయడం బాధాకరమన్నారు.


ప్రభుత్వ వైఫల్యమే



తిరుపతిలో గోవింద భక్తుల మరణాలకు కారణం ప్రభుత్వ వైఫల్యమే. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చిన ఏడుగురు తొక్కిసలాటలో మరణించడం దురదృష్టకరం. ఈ మరణాలకు ముమ్మాటికీ సీఎం చంద్రబాబు, టీటీడీ పాలకమండలిదే బాధ్యత. ప్రమాదంతో ఈ మరణాలు సంభవించినట్లు ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. ఈ మరణాలు చంద్రబాబు అసమర్థపాలనతో ప్రభుత్వం చేసిన హత్యలే. ప్రభుత్వం నియమించిన టీటీడీ పాలకమండలి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు టికెట్లకు వచ్చిన వారు చనిపోయిన చరిత్ర ఇప్పటి వరకు టీటీడీలో లేదు. లడ్డూ వ్యవహారంలో ఏదో జరిగిందని ఊగిపోయిన సనాతన యోధుడు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇప్పుడెందుకు స్పందించడం లేదు.

– ఆర్కేరోజా, మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి


ఈ పాపం చంద్రబాబుదే



గోదావరి పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాటలో 22 మంది.. మొన్న విజయవాడలో వరద విలయానికి 20 మంది.. నిన్న ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు. ఇదంతా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కాదా..? ఈ పాపం చంద్రబాబుది కాదా?. ఈ మహాపచారానికి సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలి. తిరుమల చరిత్రలో ఇలాంటి దురదృష్టకర ఘటన నేనింత వరకూ చూడలేదు.

– కళత్తూరు నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత



తిరుపతిలో చోటు చేసుకున్న విషాద ఘటనకు పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదే. గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆధ్యాత్మిక నగరం తిరువీధులు బుధవారం రాత్రి ఆర్తనాదాలతో భీతిల్లి పోయాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు, వారి బంధువులు స్వగ్రామాలకు మృతదేహాలతో ఊరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడడం దారుణం.

– కళత్తూరు కృపాలక్ష్మి, వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్

చంపేశారు స్వామీ!

- వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ ఏర్పాట్లు అస్తవ్యస్తం
- దైవదర్శనానికి వస్తే శవాన్ని చేతికిచ్చారు
- అధికారుల అలసత్వంతోనే నిండు ప్రాణాలు బలి
- అరుణాచలం, శబరిమలైలో ఇలాంటి ఘటనలే ఉండవు
- అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం
- టీటీడీలో క్రమశిక్షణ, భయం, భక్తి కొరవడిందంటున్న భక్తులు, స్థానికులు

'భక్తులకు భద్రత కల్పించాల్సిన అధికారులు నాయకులకు గులామ్ అయ్యారు. అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. భక్తుల నిండు ప్రాణాలను గాల్లో కలిపేశారు. ప్రాణాలతో వైకుంఠ ద్వార దర్శనానికి వస్తే.. శవాన్ని చేతికిచ్చారు. టీటీడీ అధికారుల తీరుతో భక్తులు నరకయాతన పడ్డారు. బుధవారం తిరుపతి బైరాగిపట్టెడ ద్వార దర్శన టికెట్ కౌంటర్ల వద్ద జరిగిన తోపులాటలో ఐదుగురు మహిళా భక్తులు, ఒక పురుషుడు చనిపోవడం దారుణం. 48 మంది భక్తులు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కావడానికి ప్రధాన కారకులు టీటీడీ, పోలీసు అధికారుల నిఘా లోపల్యమే. అరుణాచలంలోని గిరిప్రదక్షిణ, తిరువణ్ణామలై కార్తికదీపం, శబరిమలై దర్శన సమయంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చోటు చేసుకోలేదు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం, అధికారులు, నేతల మధ్య సమన్వయ లోపంతోనే భక్తుల ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది'.. అని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు విమర్శలు గుప్పిస్తున్నారు.

– తిరుపతి సిటీ



క్యూలో ఇక్కట్లు పడుతున్న భక్తులు

చిత్రహింసలకు గురిచేశారు



సాధారణ భక్తుల సేవకు ప్రాధాన్యత నిస్తామంటూ పాలకులు, అధికారులు ప్రగల్భాలు పలికారు. లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కౌంటర్లకు రప్పించి చిత్రహింసలకు గురిచేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం టీటీడీలో ఉద్యోగం కల్పించాలి. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి. టీటీడీలో అధికారుల తీరు మారేందుకు ప్రభుత్వ కఠినంగా వ్యవహరించాలి.

–లక్ష్మమ్మ, సీఐటీయూ నాయకురాలు, తిరుపతి


ప్రభుత్వ తప్పిదం వల్లే



లక్షల మంది భక్తులు వస్తారని తెలిసి కూడా అధికారులను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. టీటీడీ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వహించారు. లక్షల మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారు. వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ విషయంలో అధికారులు, పోలీసుల తప్పిందం స్పష్టంగా కనిపిస్తోంది. తమిళనాడు, ఆంధ్ర, కేరళ భక్తులు క్యూలైన్ల తొక్కిసలాటలో చనిపోవడం దారుణం. కనీస వసతుల కల్పనపైనా, భక్తులను కంట్రోల్ చేయడంలోనూ.. వారికి టోకన్ల సమాచారం అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బుధవారం జరిగిన ఘటనపై విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలి.

–నారాయణరావు, రిటైర్డ్ ఉద్యోగి, తిరుపతి

ఇంత నిర్లక్ష్యమా?



తిరుణ్ణామలైలో గత ఏడాది జరిగిన కార్తీక దీపోత్సవంలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి కోట్ల మంది భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఆ ప్రదేశంలో అడుగడుగునా పోలీసు బందోబస్తు కల్పించారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు. కానీ తిరుమలలో వైకుంఠ ద్వార దర్శన టికెట్ల క్యూలైన్లలో తాగునీరు, భోజన వసతి, కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. పిల్లలు, మహిళలు, వృద్ధులు పడిన బాధ వర్ణనాతీతం. ప్రత్యక్ష సాక్షిగా చెబుతున్నా. తొక్కిసలాటలో చనిపోయిన వారి ఉసురు అధికారులకు, ఈ ప్రభుత్వానికి తగులుతుంది. ఒక్కసారిగా క్యూలోకి భక్తులను వదలడం వల్లే తొక్కిసలాట జరిగింది.

–సుహాసిని, ప్రత్యక్ష సాక్షి, బైరాగిపట్టెడ, తిరుపతి

టీటీడీలో రాజకీయ జోక్యం ఎక్కువ



ఉద్యోగులు సేవే లక్ష్యంగా పని చేయాల్సి ఉంది. కానీ టీటీడీలో అధికారులు, సిబ్బంది కలెక్టర్, సీఎం స్థాయితో పోల్చుకుంటున్నారు. భక్తులతో అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. టీటీడీలో పనిచేస్తున్నామంటే తామే దేవుళ్లుగా ఫీలవుతుంటారు. భక్తులంటే రోడ్లపై అడుక్కుతినే యాచకుల కంటే హీనంగా చూస్తున్నారు. గతంలో ఇలాంటి సంస్కృతి ఉండేది కాదు. గోవిందా అంటూ భక్తులను ప్రస్తావించే వారు. టీటీడీలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో ఇలాంటి పరిస్థితి నెలకొంది. టీటీడీలో ప్రక్షాళన చేపట్టాలి.

–గణేష్, భక్తుడు, తిరుపతి

భక్తులను లెక్కచేయలేదు



తమిళనాడులోని అరుణాచలంలో గిరిప్రదక్షిణకు పలు రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. ఇప్పటివరకు చిన్న ఘటన చోటు చేసుకోలేదు. అక్కడి పద్ధతులు, ఉద్యోగులు, అధికారుల ప్రవర్తన, భక్తులపై ప్రేమానురాగాలు కురిపిస్తుంటారు. కానీ తిరుమల అధికారుల తీరు అందుకు భిన్నంగా ఉంటోంది. దురుసు ప్రవర్తనతో పాటు, భక్తులను లెక్కచేయకుండా మాట్లాడుతుంటారు. ఇలాంటి ఘటనలకు బాధ్యులైన టీటీడీ అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలి.

–ప్రకాష్, స్థానికుడు, తిరుపతి రూరల్

టీటీడీ చరిత్రలో దుర్దినం



టీటీడీ చరిత్రలో ఇదో దుర్దినం అని చెప్పాలి. ఇందుకు ప్రధాన కారణం పోలీసుల నిర్లక్ష్య వైఖరితో పాటు, టీటీడీ అధికారుల వ్యవహార శైలే కారణం. పర్యవేక్షణ, ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం వహించారనే విషయం సుస్పష్టం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల మాట దేవుడెరుగు కనీసం స్థానికులతో సైతం వారి వ్యవహార శైలి అహంకారపూరితంగా ఉంటుంది. దేశంలోని ఏ దైవ క్షేత్రాలలోనూ ఇలాంటి వ్యవహార శైలి కనబడదు. భక్తులతోనే చెలగాటం ఆడుకోవడంతో సనాతనధర్మానికి ఇదో పెను ముప్పు.

–గౌరీదేవి, స్థానికురాలు, తిరుపతి

క్లుప్తంగా

వినాయకుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచలకిషోర్

కాణిపాకం: వరసిద్ధివినాయక స్వామివారిని గురువారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు పలికారు. ఈఓ పెంచల కిషోర్ స్వామివారి ప్రసాదం, చిత్రపటం ఆమెకు అందజేశారు. సీఐ శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

ఎస్టీఓ, సిబ్బంది సస్పెన్షన్

పలమనేరు: సీనియర్ అసిస్టెంట్‌కు సంబంధించిన బిల్లును డబుల్ పేమెంట్ చేసినట్టు డీటీఓ ఆడిట్‌లో తేలడంతో పలమనేరు ఎస్టీఓ కోలా మునికృష్ణ, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నజీర్‌బాషాతోపాటు మరో ఇద్దరు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ మేరకు రెండ్రోజుల క్రితం మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ మోహన్‌రావు నుంచి ఆదేశాలు అందినట్టు తెలిసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ సుజాతకు సంబంధించిన రూ.42 వేల బిల్లును డబుల్ పేమెంట్ చేసినట్టు ఆడిట్‌లో తేలడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. ఆ మేరకు పలమనేరు నూతన ఎస్టీఓగా జే రవి గురువారం విధుల్లో చేరారు. ఇలా ఉండగా ఈ కార్యాలయంలో సస్పెండ్ అయిన నజీర్ గతంలోనూ పలు అక్రమాలకు పాల్పడినట్టి తెలుస్తోంది. ఈ విషయమై సస్పెండ్ అయిన మునికృష్ణ మాట్లాడుతూ అసలు పేమెంట్ వారి ఖాతాల్లోకి పోనేలేదని, కానీ తప్పు జరిగినట్టు విధుల నుంచి తొలగించడం సబబు కాదన్నారు.

కాణిపాకం.. సత్యప్రమాణాలకు నిలయం .. ఈ క్షేత్రం స్వయంభువు వరసిద్ధుడి ఆలయం.. ఇటీవల ఆధునికీకరణతో కొత్త రూపు సంతరించుకుని అలరారుతున్న దేవస్థానం.. ఫలితం నిత్యం పెరుగుతున్న భక్త జనం.. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకన్ల జారీ సందర్భంగా తిరుపతిలో అశృతి జరిగిన నేపథ్యంలో నీ భక్తుల భద్రమెంత వినాయకా అని ఘోషిస్తున్న భక్త గణం. దీనిపై ప్రత్యేక కథనం.



కాణిపాకంలో వీఐపీ గేటు ఎదుట గుమికూడిన భక్తులు

నీ భక్తుల భద్రతెంత వినాయకా!

- కాణిపాక క్షేత్రానికి పోటెత్తుతున్న భక్తులు
- ప్రత్యేక దర్శన సేవల్లోనే సిబ్బంది
- ప్రొటోకాల్ విషయంలోనూ చిన్నచూపు
- అప్రమత్తత అవసరం
- తిరుపతి ఘటన నేపథ్యంలో తగిన ప్రణాళిక ఆవశ్యం

కాణిపాకం: వరసిద్ధి వినాయక క్షేత్రానికి భక్తుల పోటెత్తుతున్నారు. వేలాదిగా తరలివస్తూ.. స్వామివారి దర్శనం కోసం క్యూకడుతున్నారు. వీరి రాకతో ఆలయం కిటకిటలాడుతుంటోంది. ప్రత్యేక రోజుల్లో జక్త జనసంద్రంగా మారుతోంది. దర్శనం కోసం అన్ని క్యూల్లో భక్తులు కిక్కిరిసిపోతుంటారు. ఆ సమయంలో భక్తుల మధ్య తేలిక పాటి తోపులాటలు జరుగుతుంటాయి. ఇలాంటి తరుణంలో భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మిగిలింది. భక్తుల భద్రతపై అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కొట్టుచ్చినట్టు కనిపిస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నప్పటికీ భక్తుల విషయంతో మరింత భద్రత అవసరమని భక్తులతోపాటు ఉభయకర్తలు అధికారులను హెచ్చరిస్తున్నారు. సత్యప్రమాణాలకు నెలవులగా కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం విరాజిల్లుతోంది. స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాపంగా భక్తులు నిత్యం వేలాదిగా తరలి వస్తుంటారు. శని, ఆదివారాలతో పాటు ప్రత్యేక దినాల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతోంది. వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల సంఖ్యకు లక్షకు చేరవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ప్రజాప్రతినిధులు, పాలకమండలి సహకారంతో ఆలయం ఆధునీకరణతో కొత్త రూపం దాల్చి చరిత్రకెక్కింది. దీంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య చూస్తే 10 వేలు ఉంది. శని, ఆదివారాల్లో 30 వేలు దాటుతోంది. పండుగ సమయాల్లో 60 వేలు, వార్షిక బ్రహ్మోత్సవాల్లో 80 వేల నుంచి లక్ష వరకు వస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఎక్కువగా తిరుమల, అరుణాచలం, అయ్యప్పదీక్ష సమయంలో శబమల వెళ్లే భక్తులు వినాయక స్వామి దర్శించుకుని వెళుతున్నట్లు చెబుతున్నారు. దీనికి తగ్గట్టు ఆలయ ఆదాయం కూడా గణనీయంగాపెరిగింది.

ఈ సమస్యలు గుర్తించాలి

భక్తుల రద్దీ సమయంలో ఆలయ సిబ్బంది, అధికారులు విధి నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలి. కొంతమంది విధులను మరిచి సొంత పనులు, ఇతరాత్ర పనుల్లో తిరుగుతుంటారు. అందుబాటులో ఉండడంలేదు. ముఖ్యంగా రద్దీ సమాచారం సక్రమంగా అందించాలి. విధుల్లో ఉండే కొందరు అధికారులు, సిబ్బందికి ఈ విషయం పట్టడంలేదు. క్యూలో సమాచారాన్ని భక్తులకు తెలియజేయడం లేదు. ఉచిత దర్శనంలో ఇబ్బందులను గుర్తించాలి. ఇక వీఐపీ దర్శనంలో ఇటీవల భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రైవేటు వ్యక్తులు దర్శన సేవలకు అడ్డుకట్టవేయాలి.

క్యూల పరంగా చూస్తే...

భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు ఉచిత దర్శన క్యూలు, శ్రీఘ దర్శనం, అతి శ్రీఘ్ర దర్శనం క్యూలు ఉన్నాయి. అలాగే వీఐపీ దర్శన సేవలు కూడా నడుస్తున్నాయి. ప్రత్యేక రోజుల్లో అదనపు క్యూల ఏర్పాట్లు జరుగుతోంది. అయితే భక్తుల రద్దీ సమయంలో అడపదడప తోపులాటలు చోటుచేసుకుంటోంది. దీంతో క్యూలో ఉన్న చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో సొమ్మసిల్లుతుంటారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలు లేవు. బుధవారం తిరుపతిలో వైకుంఠ ద్వార సర్వదర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తోపులాట జరిగి పలువురు మత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో కాణిపాకంలో క్యూల వ్యవస్థ పటిష్టతకు దృష్టి పెట్టాల్సి ఉందన్న చర్చ నడుస్తోంది.

సిబ్బంది నిర్లక్ష్యం..?

ఆలయంలో క్యూల వ్యవస్థ సరిగా లేక రద్దీ రోజుల్లో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంత మంది సిబ్బంది సొంత సేవకు పరుగులు పెడుతుంటారు. వారి విధులను మరిచి సొంత సేవలకు పోరాడుతుంటారు. ఆలయ ఆవరణ నుంచి మూలస్థానం ద్వారా స్వామివారి వద్దకు దగ్గరుండి తీసుకెళుతుంటారు. ఇలాంటప్పుడు ఆప్రాంతంలో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యలని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇక కొంత మంది ప్రైవేటు వ్యక్తులు సైతం తెల్లచొక్కా ధరించి, ఆలయ సిబ్బంది మాదిరిగానే పెత్తనం చలాయిస్తుంటారు. వీరి తీరు ఆలయంలో మితిమీరుతోంది. ఇలాంటి దళారీలు ఒక్కొక్క దర్శనానికి రూ.వెయ్యి వరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రద్దీ సమయంలో అప్రమత్తంగా ఉన్నాం



రద్దీ సమయంలో క్యూలైన్ల విషయంలో మరింత పటిష్టంగా వ్యవహరిస్తున్నాం. పండగలు, బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ నిఘా కూడా ఉంది. పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంచుతున్నారు. భద్రత విషయంలో ధోకా లేకుండా చూస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

–పెంచల కిషోర్, ఈఓ, కాణిపాకం

క్రీడలతో దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం

– జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ



క్రీడల్లో పాల్గొన్న దివ్యాంగులు

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న బాలాజీ మాట్లాడుతూ దివ్యాంగులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడంతో దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. అనంతరం దివ్యాంగులకు షాట్‌పుట్, 100 మీటర్ల పరుగుపందెం, బెంచ్ డిస్కస్‌త్రో, స్టాండింగ్ డిస్కస్ త్రో, జావిలిన్ బెంచ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 31వ తేదీన విశాఖపట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పారా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు అయ్యనార్, కోచ్‌లు రఫీక్, రాఘవ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



సామూహిక బ్రాహ్మణ పరిచయ వేదిక పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ ప్రతినిధులు

కుప్పంరూరల్: తిరుపతిలో ఫిబ్రవరి 2న జరగనున్న వెంకట గాయత్రి బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ సుధీర్ కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో బ్రాహ్మణ వివాహ పరిచ వేదిక, సామూహిక షష్టి పూర్తి, భీమ రథశాంతి, సహస్ర చంద్ర దర్శన, ఆయుష్ హోమం, గణపతిహోమం, దారాభిషేకం, వస్త్రాభిషేకం తదితర అంశాలకు సంబంధించిన పోస్టర్‌ను బ్రాహ్మణ సంఘాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీ లోపు పేద బ్రాహ్మణులు ఈ కార్యక్రమాలకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన కుప్పం ప్రాంత పేద బ్రాహ్మణులు కుప్పం పట్టణంలో బాలసుబ్రమణ్యం శాస్త్రి వద్ద రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 2న తిరుపతి పట్టణంలోని ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న పాదుక మండలంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు శేషగిరిరావు, కామేశ్వర రావు, ప్రసాద్‌రావు, మధుసూదన్, శ్రీకాంత్, హరికృష్ణ, బాలసుబ్రమణ్యంశాస్త్రి, సోము శాస్త్రి పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

- 15 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- బెంగళూరుకు తరలింపు



గాయపడిన వారిని విచారిస్తున్న పోలీసులు



వంద పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

కుప్పం: పట్టణంలోని పైబాటలో ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో 15 మందికి గాయాలు అయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని పైబాట, గుడుపల్లె రోడ్డులో ఉన్న డబ్బావాళ్ల మధ్య ఏర్పడిన తగాదా చిలికి చిలికి గాలివానలా మారింది. పైబాటలో ఉన్న మణి అన్న కొడుకు అదే ప్రాంతానికి చెందిన ఉలింగం కుటుంబానికి చెందిన అమ్మాయితో గత కొంత కాలం క్రితం వివాహం జరిగింది. ఇష్టం లేని పెళ్లి చేసినందుకు ఇరు కుటుంబాల మధ్య తీవ్రస్థాయిలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ వివాదంపై ఇరు కుటుంబాల మధ్య గతంలో పలుసార్లు పంచాయితీలు నిర్వహించారు. నూతన దంపతుల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నంలో గురువారం మరోసారి పంచాయితీ నిర్వహించారు. ఈ పంచాయితీలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దారి తీసింది. దీంతో అమ్మాయి తరఫున బంధువులు మణి వర్గీయులపై దాడి చేశారు. కత్తులు, రాడ్లు, మిరపపొడితో ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘర్షణలో మణి వర్గీయులు ముత్తు, అముద, ఇంద్ర, జ్యోతి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. దీంతో పాటు ప్రత్యర్థి వర్గానికి చెందిన కార్తి, నిర్మల, చిరంజీవి, రేణుక, ముకుంద, నంద, అశోక్ తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు కుప్పం వంద పడకల ఆస్పత్రి, ప్రైవేటు నర్సింగ్ హోమ్, పీఈఎస్ మెడికల్ కళాశాలలో చికిత్సలు పొందుతున్నారు. ఈ మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులపై పట్టు రైతుల తిరుగుబాటు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రపట్టుమండలి కార్యదర్శి శివకుమార్



తమ డిమాండ్లను పరిష్కరించాలంటున్న పట్టు రైతులు

పలమనేరు: రూ.కోట్ల పెండింగ్ ఇన్‌సెంటివ్‌లు చెల్లించకుండా మీటింగ్‌లు పెట్టి పట్టురైతులకు ఏం మేలు చేస్తారంటూ పట్టు రైతులు సమావేశానికి హాజరైన పట్టుపరిశ్రమ శాఖ ఉన్నతాధికారులపై తిరుగుబాటు చేసిన సంఘటన గురువారం పలమనేరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలమనేరు ప్రాంతంలోని పట్టుసాగు చేసే రైతులకు ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, అనంతపురం వారిచే పట్టురైతుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించారు. అయితే తిరుపతి ఘటనకు సంబంధించి రాజకీయనేతలు వెళ్లడంతో ఈ కార్యక్రమానికి వారు హాజరు కాలేదు. దీంతో కేంద్ర పట్టుమండలి కార్యదర్శి శివకుమార్, పట్టుపరిశ్రమశాఖ సంచాలకులు శ్రీనివాసులు, సంచారకులు గాంధీదాస్, ఏడీ అరుణకుమారి, శాస్త్రవేత్త భాగ్య తదితరులు మాత్రం హాజరయ్యారు. పట్టుపరిశ్రమకు సంబంధించి యాంత్రీకరణ, సాంకేతిక నైపుణ్యాలపై వారు సమావేశం మొదలు పెట్టారు. ఈ కార్యక్రమానికి వచ్చిన పట్టురైతులు తమకు పట్టుగూళ్లపై కిలోకు రూ.50 చొప్పున ఇవ్వాల్సిన ఇన్‌సెంటివ్ రూ.కోట్లలో పెండింగ్‌లో ఉందని, దాన్ని ఎప్పుడు ఇస్తారో చెప్పి సమావేశం మొదలు పెట్టాలని వాసు తదితర రైతులు నిలదీశారు. దీంతోపాటు గతంలో లాగా మల్బరీ షెడ్లకు రాయితీలు, పట్టుపరిశ్రమశాఖ సబ్సిడీలు అసలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆశాఖ అధికారులు సమావేశం మాట్లాడుతుండగానే రైతులు సమావేశాన్ని బహిష్కరించి, వెళ్లిపోయారు. ఫలితంగా ఇక్కడ ఏర్పాటు చేసిన పట్టు రైతుల సమ్మేళనం రైతులు ఉపయోగం లేకుండా పోయింది.

బోయకొండ హుండీ ఆదాయం రూ.58.68 లక్షలు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలోని హుండీ కానుకల ద్వారా రూ.58.68 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.58,68,134, బంగారం 18 గ్రాములు, వెండి 420 గ్రాములు వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయం వద్దనున్న హుండీ ద్వారా రూ.33,188 లు సమకూరాయన్నారు. ఈ ఆదాయం 42 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు.



సంక్రాంతి.. హిందువులకు అతి ముఖ్యమైన పర్వదినం.. ఉద్యోగ, వ్యాపార రీత్యా అధిక శాతం మంది సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా సొంతూళ్లకు పయనమవుతున్నారు. ప్రైవేటు వాహనాలు, కార్ల చార్జీలు భరించలేకున్నారు. వీరందరూ పండుగకు పదిలంగా వెళ్లి రావాలన్న లక్ష్యంతో సాధారణ చార్జీలకే ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. దీనిపై ప్రత్యేక కథనం.

సంక్రాంతి ప్రయాణం పదిలం

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- శనివారం నుంచి 13వ తేదీ వరకుసర్వీసులు
- తిరుగు ప్రయాణం ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు..
- హైదరాబాద్, విజయవాడ, బెంగళూరుకు ప్రత్యేక సర్వీసులు
- రానుపోను టికెట్ బుకింగ్‌పై పది శాతం రాయితీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆర్టీసీలో సంక్రాంతి సందడి మొదలైంది. పెద్ద పండుగకు సొంతూరుకు వచ్చి వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రణాళికాబద్ధంగా సేవలందించేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్, విజయవాడ, కర్ణాటక తదితర దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చేవారి కోసం, తిరుగు ప్రయాణాలకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి 120 ప్రత్యేక బస్సు సర్వీసులు, 220 పైగా షెడ్యూల్ బస్సు సర్వీసులు నడపాలని అధికారులు నిర్ణయించారు.

మళ్లీ ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా ప్రత్యేక బస్సులు నడిపే అంశంపై అధికారులు పూర్తిస్థాయి ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమయానికి బస్సు సర్వీసులు ఉండేలా చర్యలు చేపట్టారు. శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ప్రత్యేక బస్సు వివరాలు...

డిపోలు	బెంగళూరు	హైదరాబాద్	విజయవాడ	తిరుపతి
చిత్తూరు–1	30	08	0	0
చిత్తూరు–2	38	08	0	0
పలమనేరు	06	0	0	0
పుంగనూరు	08	0	08	0
కుప్పం	0	02	0	12


సర్వీసులిలా..

ప్రస్తుతం జిల్లా నుంచి హైదరాబాద్‌కు 10 సర్వీసులు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రైవేట్ ఆపరేటర్లు బస్సులు నడిపి సొమ్ము చేసుకుంటున్నారు. వాటికి చెక్ పెట్టేందుకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ 18 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. ఇప్పటికే ప్రైవేటు ఆపరేటర్లు హైదరాబాద్‌కు రూ.1800 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. కానీ, ఆర్టీసీలో మాత్రం రూ.1,085 సూపర్ లగ్జరీ, రూ.1,390 ఇంద్ర సర్వీసులో ప్రయాణించవచ్చు. జిల్లా నుంచి విజయవాడకు ప్రస్తుతం రోజుకు 4 బస్సులు నడుస్తుండగా పండగ సందర్భంగా ప్రతిరోజూ పుంగనూరు నుంచి 8 సర్వీసులు నడపనున్నారు. జిల్లా నుంచి బెంగళూరుకు ప్రతిరోజూ 30 బస్సు సర్వీసులు ఉండగా 52 చొప్పున్న అదనపు బస్సులను నడపనున్నారు. తిరుపతికి 87 బస్సులుంటే ప్రత్యేక బస్సుల కింద 12 వరకు అదనంగా నడపనున్నారు. సంక్రాంతి సెలవులు, తిరుగు ప్రయాణాల సందర్భంగా ఎవరు, ఎక్కడికి, ఎన్ని టికెట్లు అడిగినా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

10 శాతం రాయితీ

ఏసీ, అల్ట్రాడీలక్స్, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ తదితర సర్వీసుల్లో రానుపోను ఒకేసారి టికెట్ తీసుకున్న సంక్రాంతి ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించారు. ప్రత్యేక సర్వీసులకు అదనపు చార్జీలు లేకుండా పేద మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకుని 10 శాతం రాయితీ కల్పించడంతో ప్రయాణికులు ఆర్టీసీ వైపు మొగ్గు చూపుతున్నారు. ముందుగానే రిజర్వేషన్లు చేసుకుంటున్నారు.

అవసరమైతే మరిన్ని బస్సులు నడుపుతాం



ఇప్పటికే సంక్రాంతికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధం అయ్యాం. శుక్రవారం నుంచి ప్రత్యేక సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. సాధారణ ఛార్జీలే వర్తిస్తాయి. అదనపు ఛార్జీలుండవు. బస్సులు చాలని పక్షంలో మరిన్ని నడిపేందుకుగా సిద్ధంగా ఉన్నాం. అధికారులకు కూడా ఆ రకంగా ఆదేశాలిచ్చాం. ఏవైనా ఇబ్బందులుంటే ప్రయాణికులు డిపో అధికారులను సంప్రదించవచ్చు.

–జగదీష్, డీపీటీఓ, చిత్తూరు